క్లుప్తంగా

భువనేశ్వరీమాత విగ్రహం వితరణ



కడప కల్చరల్‌ : కడప నగరం చలమారెడ్డిపల్లెలోని శ్రీ దశమహావిద్య భువనేశ్వరీదేవి మందిరానికి మంగళవారం అజ్ఞాత భక్తుడు పంచలోహంతో తయారు చేసిన ఉత్సవ విగ్రహాన్ని వితరణ చేశాడు. మందిర నిర్వాహకులు ఈ విగ్రహానికి శాస్త్రోక్తంగా జలాధివాసం, ధాన్యాధివాసం, క్షీరాధివాసం తదితర ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వర్ణ ఆభరణాలు, పూలతో అమ్మవారి విగ్రహాన్ని అలంకరించారు. నిర్వాహకులు నాగేంద్రస్వామి పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు చంద్రస్వామి, ఆలయ అధ్యక్షుడు దండు లక్ష్మీకళ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు అభినందన



ఎన్‌సీసీ కేడెట్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌, ఎన్‌సీసీ అధికారులు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)కు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు ఆర్మీ అటాచ్‌మెంట్‌ క్యాంపులో చక్కటి ప్రతిభ కనబరచడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్‌ డా. జి. రవీంద్రనాథ్‌ అభినందించారు. ఈనెల 14 నుంచి 23వ తేదీ వరకు సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఆర్మీ అటాచ్‌మెంట్‌ క్యాంపులో కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు అశోక్‌, అభిరామ్‌ పాల్గొని సాయుధ శిక్షణ, గ్రూప్‌ డిస్కషన్‌ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వీరిని మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్‌ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ విభాగాల్లో నిర్వహించే ఎన్‌సీసీ క్యాంపుల్లో పాల్గొనడం ద్వారా ఆయా రంగాల్లో ఉపాధి అవకాశాలపై అవగాహన పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్‌ డాక్టర్‌ ఆర్‌. నీలయ్య, డా. మహేష్‌, కేడెట్లు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 76 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్‌

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్‌ అండ్‌ ఎస్‌కేఆర్‌ ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్‌ జాబ్‌ డ్రైవ్‌కు విద్యార్థుల నుంచి చక్కటి స్పందన లభించింది. స్టార్‌ హెల్త్‌ ఇన్సూరెన్స్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన కస్టమర్‌ సపోర్ట్‌ ఉద్యోగాలకు 180 మంది విద్యార్థులు హాజరుకాగా 76 మంది షార్ట్‌లిస్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ డా. వి. సలీంబాషా తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ డా. పి. గురివిరెడ్డి, డా. కె.వి.ప్రసాద్‌, జేకేసీ ప్రతినిధులు వరప్రసాద్‌, రవీంద్రారెడ్డి, స్టార్‌ హెల్త్‌ ఇన్సూరెన్స్‌ ప్రతినిధులు హరిహరన్‌, ముత్తుస్వామి, సమరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యశాస్త్రంలో డాక్టరేట్‌



బాలాజి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం కామర్స్‌ విభాగం పరిశోధకుడు డి. బాలాజీకి విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ ప్రదానం చేసింది. వాణిజ్యశాస్త్రశాఖ ఆచార్యులు, ప్రస్తుత వైవీయూ ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌. రఘునాథరెడ్డి పర్యవేక్షణలో 'ఫైనాన్షియల్‌ ఇన్హెబిటెడ్నెస్‌ అమాంగ్‌ అగ్రికల్చర్‌ ఫార్మర్స్‌ విత్‌ స్పెషల్‌ రిఫరెన్స్‌ టు రాయలసీమ రీజియన్‌ ఆఫ్‌ ఆంధ్రప్రదేశ్‌' అన్న అంశంపై ఈయన చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ను ప్రకటించారు.

రైతులు వివరాలను అందజేయాలి

రామాపురం : 2023–24 సంవత్సరానికి సంబంధించి గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పండ్ల తోటల రైతులు బ్యాంక్‌ ఖాతా, ఆధార్‌, పాన్‌కార్డుల జిరాక్స్‌ను బుధవారం ఉపాధి కార్యాలయంలో అందజేయాలని ఏపీఓ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2023 – 24 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకంలో మండల వ్యాప్తంగా 66 మంది లబ్ధిదారులకు సంబంధించి 262 ఎకరాలు పండ్ల తోటల పెంపకానికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. త్వరగా లబ్ధిదారుల సమాచారాన్ని వెండర్‌ ఐడియా కింద నమోదైతే బ్యాంకు ఖాతాలో నగదును జమ చేస్తామన్నారు. పండ్ల తోటల పెంపకానికి సంబంధించిన మూడు సంవత్సరాలకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, ఎకరాకు మూడు సంవత్సరాలకు రూ.1.05లక్ష చొప్పున జమ అవుతుందన్నారు.

విజయదుర్గమ్మ ఆలయంలో రాహుకాల పూజలు





రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్‌ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో ప్రతి మంగళవారంలాగానే ఈసారి కూడా రాహుకాల పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొనేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. ముందుగా అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్శనానంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు. ఆలయ వ్యవస్థాపకుడు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్‌ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గుణాత్మక విద్యను అందించడమే బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంఓ ధనలక్ష్మి

కడప ఎడ్యుకేషన్‌: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించే బాధ్యత గురువులదేనని సమగ్రశిక్ష అకడమిక్‌ మానటరింగ్‌ అధికారి ధనలక్ష్మి అన్నారు. మంగళవారం కడప నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు పాఠశాల సముదాయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఏఎంఓ ధనలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో నిరంతరం మార్పులు జరుపుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దీనికి తగినట్లుగానే ఉపాధ్యాయులు కూడా పాఠశాలల్లో చదివే విద్యార్థులకు గుణాత్మక విద్యతోపాటు నైతిక విలువతో కూడిన బోధనలను అందించాలన్నారు. ఈ సమావేశం ద్వారా ఉపాధ్యాయులు కొత్త కొత్త అంశాలను తెలుసుకుని మార్పుకు అనుగుణంగా బోధనలను సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సముదాయ ఆర్పీలు ఫాతిమా సుల్తానా, రహీంబకాస్‌, పీఎండీ మునిఫ్‌ ఉపాధ్యాయులకు విద్యావ్యవస్థలో నూతనంగా వచ్చిన మార్పులను, తరగతిగదిలో బోధనను సవివరంగా తెలియచేశారు. కార్యక్రమంలో పాఠశాల సముదాయ క్లస్టర్‌ రిజర్వ్‌ మొబైల్‌ టీచర్‌ ఆదిమూలం శంకర్‌, సముదాయ పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకృతి సేద్యం మేనేజర్‌ రామక్రిష్ణంరాజు

కడప అగ్రికల్చర్‌ : ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడులను సాధించడం సాధ్యమని ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్‌ రామక్రిష్ణంరాజు అన్నారు. మంగళవారం కడప ప్రకృతి వ్యయసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అందరూ మాస్టర్‌ ట్రైనర్‌ పరిధిలో జరిగే పొలంబడికి హాజరవుతూ పొలం చుట్టూ ఉండే రైతులకు ప్రకృతి వ్యవసాయంలోకి తీసుకొచ్చే విధంగా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. అదే విధంగా పురుగు,తెగుళ్లపైన ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతూ రైతులు నష్టపోకుండా కషాయాలు, ద్రావణాలను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రకృతి వ్యవసాయ ఎస్సీ రైతులు జాబితా సిద్ధం చేసి వారికి ఎస్సీ కార్పోరేషన్‌ నుంచి సీడ్‌ కిట్స్‌ అందే విధంగా చూడాలన్నారు. సిబ్బంది వారి వివో పరిధిలోని క్రాపు మోడల్స్‌ని డెవలప్‌ చేయాలని సూచించారు. అలాగే పంటల నమూనాపైన అవగాహన కల్పించాలన్నారు. ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. పంటల సాగులో వారికి కావాల్సిన సలహాలు, సూచనలు ఇచ్చి అధిక దిగుబడి వచ్చే విధంగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి సిబ్బంది, డీపీఎంయూ సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్‌ మారణకాండ మానవత్వానికి మచ్చ



అంబేద్కర్‌ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్‌ నాయకులు

కడప ఎడ్యుకేషన్‌ : మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లు ప్రత్యేకించి మహిళలపై జరుగుతున్న మారణకాండ మానవత్వానికి మచ్చని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు అన్నారు. మంగళవారం కడప ఆర్టీసీ బస్టాండ్‌ వద్ద ఉన్న అంబేద్కర్‌ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని మణిపూర్‌లో మారణకాండకు ముగింపు పలకాలని కోరారు. లేకపోతే మణిపూర్‌ బాధితుల పక్షాన ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్‌ జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్‌, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్‌రాహుల్‌, సరస్వతి, జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మధుసూదన్‌, యూటీఎఫ్‌ నాయకులు చెన్నకేశవులు, చంద్రశేఖర్‌, వీరనారాయణ, కిరణ్‌కుమార్‌, కరీముల్లా, బాబు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సీఎం శ్రద్ధతో పర్యాటకరంగానికి విశేష ప్రచారం



ఇంటర్న్‌షిప్‌ చేసిన విద్యార్థులతో ఇంటాక్‌, రాయలసీమ టూరిజం, లయన్స్‌ క్లబ్‌ ప్రముఖులు

కడప కల్చరల్‌ : ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల తీసుకున్న చర్యల ఫలితంగా జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోటకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు లభిస్తోందని, జిల్లాలోని ఇతర ప్రాంతాలకు కూడా ప్రచారం లభిస్తోందని ఇంటాక్‌ జిల్లా కన్వీనర్‌ కె.చిన్నపరెడ్డి అన్నారు. ఇటీవల జిల్లా పర్యాటకంపై పంజాబ్‌ రాష్ట్రంలోని జలంధర్‌ ఇంజనీరింగ్‌ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్‌.ఈశ్వర్‌రెడ్డి గైడ్‌గా జిల్లా పర్యాటక ప్రాంతాలపై ఇంటర్న్‌షిప్‌ చేశారు. మంగళవారం రాయలసీమ టూరిజం అండ్‌ కల్చరల్‌ సొసైటీ కార్యాలయంలో కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు పర్యవేక్షణలో వారికి పర్యాటక సంస్థ ద్వారా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిన్నపరెడ్డి, సభాధ్యక్షుడు ఆచార్య ఎస్‌.ఈశ్వర్‌రెడ్డి ఈ సందర్భంగా ఇంటర్న్‌షిప్‌ చేసిన నలుగురు విద్యార్థులకు రాయలసీమ టూరిజం సంస్థ సర్టిఫికెట్లను అందజేశారు. ఇంటాక్‌ ప్రముఖులు ఉత్తమ పోలీసు సేవా పతకానికి ఎంపికైన ఏఎస్‌ఐ రాచరాయుడిని సత్కరించారు. వైవీయూ చిత్రలేఖన విభాగం అధ్యక్షుడు డాక్టర్‌ కోటా మృత్యుంజయ రావు, పోతుల వెంకట్రామిరెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం



కమలాపురం : కోగటంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : జగనన్న సురక్షతో పూర్తికాని ప్రజల సమస్యలు పరిష్కారమవుతున్నాయని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కోగటం గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ సర్పంచ్‌ కరుణ్‌రెడ్డి అభ్యర్థన మేరకు కోగటం గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. రూ.5, 6 కోట్ల వ్యయంతో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తానన్నారు. ఇప్పటికే సీసీ రోడ్లకు రూ.20లక్షలు మంజూరు చేశామన్నారు. కోర్టు కారణంగా సచివాలయ, ఆర్‌బీకే, హెల్త్‌ క్లినిక్‌ తదితర నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయన్నారు. మంచి నీటి సమస్య రాకుండా రూ.53 లక్షలు, జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.66లక్షలు వెచ్చించామన్నారు. ఈ గ్రామానికి ఈ నాలుగేళ్లలో రూ.18 కోట్లు లబ్ధిదారుల ఖాతాకు వేశారన్నారు. 2024లో కూడా జగనన్నను సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బాబు చరిత్ర హీనుడని, తన 15ఏళ్ల పాలనలో ఒక్క మంచి పథకం అందించలేదని ధ్వజమెత్తారు. అనంతరం ఆయన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

కార్యక్రమంలో సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్‌ రామాంజులరెడ్డి, కడప ఆర్‌డీఏ ధర్మ చంద్రారెడ్డి, ఏపీపీఎస్‌సీ బోర్డు మెంబర్‌ నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, హార్టికల్చర్‌ స్టేట్‌ అడ్వైజర్‌ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మండల స్పెషలాఫీసర్‌ నరసింహారెడ్డి, మండల కన్వీనర్‌ ఉత్తమారెడ్డి, జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్‌ యార్డు చైర్మన్‌ ఎస్‌సీ పుల్లారెడ్డి, మండల వైస్‌ ప్రెసిడెంట్‌ చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌ సీపీ నాయకులు రాజుపాళెం సుబ్బారెడ్డి, కుప్పూరు మోహన్‌రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, సుధా కొండారెడ్డి, గండి భాస్కర్‌, దేవాదానం, నాగేంద్రారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, హీరామియ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్‌ : విద్యార్థుల చదువుల కోసం అమ్మ ఒడి పథకం ద్వారా తల్లుల ఖాతాలకు జమ చేస్తున్న పెండింగ్‌ నిధులను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సునీల్‌, రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న ప్రభుత్వాన్ని కోరారు. కడపలోని ప్రగతి నర్సింగ్‌ హోమ్‌ వద్ద వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి జూన్‌ 28వ తేదీన బటన్‌ నొక్కి అమ్మ ఒడి నిధులను విడుదల చేశారన్నారు. అయితే ఇంకా కొంతమంది లబ్ధిదారులకు సొమ్ము ఖాతాలో పడలేదని, వారికి కూడా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు స్వరూప్‌తేజ్‌, శ్రీనాథ్‌ పాల్గొన్నారు.

స్మార్ట్‌ఫోన్‌ను మంచి కోసమే ఉపయోగించాలి

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్మార్ట్‌ ఫోన్‌ను మంచి కోసమే ఉపయోగించాలని స్టూడెంట్స్‌ ఇస్లామిక్‌ ఆర్గనైజేషన్‌ ఆఫ్‌ ఇండియా పట్టణ అధ్యక్షుడు హనీఫ్‌ అన్నారు. మంగళవారం తమ కార్యాలయంలో అనైతిక విలువలకు వ్యతిరేకంగా ఈ ఎథిక్స్‌ వీక్‌ను నిర్వహిస్తున్నామన్నారు. యువత గంటల కొద్ది స్మార్ట్‌ ఫోన్‌ను వినియోగించడంతో శారీరక, మానసిక సమస్యల బారిన పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఈ ఎథిక్స్‌ వీక్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

జిల్లా ఆస్పత్రి పీపీ యూనిట్‌లో తనిఖీలు

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలోని పీపీయూనిట్‌ను జిల్లా గణాంక అధికారి రమేష్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు అయ్యే వారికి డిశ్చార్జి అయ్యేలోపు బర్త్‌ సర్టిఫికెట్‌ ఇవ్వాలన్నారు. జీరో డోస్‌ టీకాలు తప్పకుండా వెయ్యాలని చెప్పారు. ఈ జేఎస్‌వై, కుటుంబ నియంత్రణ తదితర వాటి గురించి అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి మెడికల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఆనంద్‌బాబు, గైనకాలజిస్టు డాక్టర్‌ శ్రీవాణి, ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ శివప్రసాద్‌, డాక్టర్‌ నజీర్‌, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ వెంకటేశ్వర్లు, నర్సింగ్‌ సూపరింటెండెంట్‌ రాణెమ్మ, హెడ్‌ నర్సులు సుశీలమ్మ, సువర్ణ, డీఈఓలు పాల్గొన్నారు.

విద్యుత్‌ లైన్‌ తొలగించాలని నిరసన

ఎర్రగుంట్ల : మా మిద్దెలపైన 33 కేవీ విద్యుత్‌లైన్‌ ఉందని దాన్ని తొలగించాలని ఎన్ని సార్లు విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపినా ప్రయోజనం లేకపోవడంతో క్రాంతినగర్‌ కాలనీ వాసుల విద్యార్థులు మంగళవారం మిద్దెలపైన ఉన్న విద్యుత్‌ లైన్‌ చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి తెలిపామని ఆయన వెంటనే లైన్‌ తొలగించాలని విద్యుత్‌ శాఖ అధికారులకు ఆదేశించినా ఇంత వరకూ ఆ శాఖ అధికారులు స్పందించ లేదన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు కల్చరల్‌ : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం విద్యాసంస్థల బంద్‌ నిర్వహించారు. పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలలు తిరుగుతూ విద్యార్థి సంఘాల నాయకులు విద్యాసంస్థలను మూసివేయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 3, 4, 5 తరగతుల విలీనం ఆపాలని, ఇంటర్‌ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని, మధ్యాహ్న భోజనం తిరిగి ప్రారంభించాలని, జీఓ నంబరు 77ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు.

రోడ్డు పనులు ప్రారంభం

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల గ్రామం తొట్టివారిపల్లె సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. సీఎండీఎఫ్‌ గ్రాంట్‌ కింద సుద్దమళ్ల గ్రామానికి రూ.30లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేయడం సంతోషదాయకమన్నారు.

సేవకు సలాం



ఏళ్ల నాటి కళ నెరవేర బోతున్న వేళ



మాధవికి ఇంటి పట్టాను అందజేస్తున్న వలంటీర్‌ రామలోకమ్‌ నాయక్‌

కడప 18వ వార్డు తారకరామానగర్‌లో దేవరకొండ రవి అనే యువకుడు కుట్టుమిషన్‌ కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సొంత ఇల్లు లేక అత్తగారి ఇంట్లో ఉంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రభుత్వం మంజూరు చేసే పథకాల్లో భాగంగా రవి భార్య మాధవికి మామిళ్లపల్లె లేవుట్‌లో ఇంటి స్థలం మంజూరైంది. దీనికితోడు ప్రభుత్వం రూ.లక్షా 80 వేలు మంజూరు చేయడంతో వారు ఇంటి పనులు మొదలు పెట్టారు. త్వరలో వీరి సొంతింటి కల నేరవేరబోతుంది.

– కడప ఎడ్యుకేషన్‌

వలంటీర్‌ సహకారంతోనే



మాకు ప్రభుత్వం నుంచి స్థలం మంజూరు కావడంలో మా వలంటీరు పూజారి రామలోకమ్‌నాయక్‌ కృషి ఎంతో ఉంది. వలంటీరే దగ్గరుండి ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేయించి మంజూరు అయ్యేలా చూసుకున్నాడు. అలాగే ప్రభుత్వం నుంచి ఇల్లు కట్టుకోవడానికి రూ.లక్షా 80 వేలు మంజూరు కావడానికి కూడా సాయపడ్డాడు. ఆయన రుణం తీర్చుకోలేనిది.

- దేవరకొండ మాధవి, తారకరామానగర్‌, కడప

రహదారి భద్రతను పాటించాలి



మాట్లాడుతున్న ట్రాఫిక్‌ సీఐ వెంకటయ్య

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఏపీఎస్‌ ఆర్టీసీ సంస్థలో పని చేస్తున్న డ్రైవర్లు రహదారి భద్రతను పాటించి ప్రమాదాల నివారణకు తమవంతుగా కృషి చేయాలని ట్రాఫిక్‌ సీఐ వెంకటయ్య పిలుపునిచ్చారు. మంగళవారం కడప ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయ కాన్ఫరెన్స్‌ హాల్లో డ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్లు రహదారి నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు. ప్రయాణంలో సిగ్నళ్లను గమనించాలని, మద్యానికి, సెల్‌ఫోన్‌ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలన్నారు.కడప డిపో మేనేజర్‌ ఢిల్లీశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఈ వారంలో ఇప్పటికి ఎనిమది ప్రమాదాలు జరగడం బాధాకరమన్నారు. ఈనెల 22న ఓరంపాడు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ఐదుగురు ప్రాణాలు కోల్పోయారన్నారు. అందులో తప్పు ఎవరిదైనా తీసుకోవలసిన జాగ్రత్తలను తప్పకుండా తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి ప్రతి రోజూ ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని రాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీజినల్‌ సేఫ్టీ డ్రైవింగ్‌ ఇన్‌స్ట్రక్టర్‌ ఎస్‌.క్రిష్టారెడ్డి, అధికారులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి



బంద్‌లో పాల్గొన్న ఆర్‌ఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్‌ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఆర్‌ఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి డిమాండ్‌ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ జిల్లావ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన విద్యాసంస్థల బంద్‌ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో అనేక సమస్యలు తిష్టవేసి ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో ఇంతవరకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలను అందించలేదన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులను దూరం చేసే జీవో నెంబర్‌ 77ను రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు.ప్రైవేటు, కార్పోరేట్‌ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలన్నారు. డిగ్రీ కళాశాలల్లో చదివే విద్యార్థులకు చెల్లించే ఫీజు రియంబర్స్‌మెంట్‌ను నేరుగా యాజమాన్యం ఖాతాలకు జమచేయాలని కోరారు. హాస్టల్‌ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలను పెంచాలన్నారు.

డీఈవో అనుచిత ప్రవర్తనపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌

కడపవైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి అనుచిత ప్రవర్తనలపై, అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులను డీఈవో ఉద్దేశ పూర్వకంగానే వేధిస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్‌ స్పందించి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో చర్చించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఐఎన్‌ సుబ్బమ్మ, రామ్మోహన్‌ పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్‌ విజయవంతం



విద్యా సంస్థలను మూసివేయిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన విద్యా సంస్థల బంద్‌ విజయవంతం అయినట్లు ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా కార్యదర్శి వలరాజు అన్నారు. మంగళవారం పలు విద్యా సంస్థలను విద్యార్థి సంఘాల నాయకులు మూసివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ,ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించి, పెండింగ్‌ మెనూ బిల్లులను చెల్లించాలన్నారు. ప్రాథమిక విద్యను విలీనం చేసే జీవో 84,85 రద్దు చేయాలన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల వల్ల ఏ విధంగా విద్య అందరికి అందుబాటులో ఉంటుందో సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 25వేల టీచర్‌ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. జూనియర్‌ కళాశాలలో ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందించి ఖాళీగా ఉన్న లెక్చరర్‌ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ విశ్వ విద్యాలయాలకు అభివృద్ధి నిధులు కేటాయించాలని, ఖాళీగా ఉన్న టీచింగ్‌, నాన్‌ టీచింగ్‌ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు జయవర్ధన్‌, బాబు, శంకర్‌, చెన్న కేశవ,ఓబయ్య పాల్గొన్నారు.

సామాజిక మార్పులకు అనుగుణంగా సీమ నవలా సాహిత్యం



మాట్లాడుతున్న ఆచార్య కిన్నెర శ్రీదేవి

కడప కల్చరల్‌ : సీమ నవలా సాహిత్యం ఈ ప్రాంత సామాజిక మార్పులకు అనుగుణంగా రూపుదిద్దుకున్నదని ద్రవిడ విశ్వవిద్యాలయం తెలుగు, అనువాద అధ్యయనాల విభాగం అధ్యక్షురాలు ఆచార్య కిన్నెర శ్రీదేవి అన్నారు.

యోగి వేమన విద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్‌ భాషా పరిశోధన కేంద్రం మంగళవారం బ్రౌన్‌ శాస్త్రి సమావేశ మందిరంలో అభ్యుదయ సాహితోపన్యాసాల పేరిట సదస్సు నిర్వహించింది. ప్రధాన వక్తగా విచ్చేసిన ఆచార్య కిన్నెర శ్రీదేవి, రాయలసీమ అభ్యుదయ నవలా సాహిత్యం అనే అంశంపై ప్రసంగించారు. రాయలసీమ నవలకు 150 ఏళ్ల చరిత్ర ఉందని, ఈ ప్రాంతం నుంచి 1950కి ముందు 20, 1980 తర్వా త 108 నవలలు వచ్చాయన్నారు. జిల్లాలోని ప్రముఖ కవులు వారి నవలల గురించి కిన్నెర శ్రీదేవి వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య నల్లపురెడ్డి ఈశ్వర్‌రెడ్డి మా ట్లాడుతూ సాహిత్యం మనిషిని ఎలా జీవించాలో, ఎలా కూడదో తెలుపుతుందన్నారు. ఉపన్యాస వ్యవస్థాపకులు, విశ్రాంత ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పి.సంజీవ మ్మ మాట్లాడుతూ అభ్యుదయ సాహితోపన్యాసాల ద్వారా సమాజంలోని సమకాలిన సమస్యలను ఎత్తి చూపడం, వాటిని ఖండించే దిశగా వచ్చిన సాహిత్యాన్ని విద్యార్థులకు చేరవేయడం ప్రధాన ఉద్దేశమన్నారు. ఆకాశవాణి పూర్వ సంచాలకులు డాక్టర్‌ టక్కోలు మాచిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ పాఠ్యాంశాలతోపాటు సమాజంలో జరుగుతున్న విషయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా విశ్రాంతి జిల్లా పరిశ్రమలశాఖ అధికారి గోపాల్‌ పాల్గొని ప్రసంగించారు.. బ్రౌన్‌ కేంద్రం పూర్వ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.